సాక్షి
సంగారెడ్డి
శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



భౌబోయ్..
ఝరాసంగం మండలంలోని ప్రధాన రహదారులపై వీధికుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి.
వివరాలు 9లో ▸



హామీలు అమలు చేస్తున్నాం
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు.
వివరాలు 9లో ▸

నేడు అవగాహన సదస్సు
విదేశాల్లో ఉద్యోగ అవకాశాలపై ఎంఎన్‌ఆర్ నర్సింగ్ కళాశాలలో శనివారం ఉదయం 11 గంటలకు అవగాహన నిర్వహిస్తున్నామని ఉపాధి కల్పనా అధికారిణి వందన శుక్రవారం తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్కామ్) ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వివరాలకు 6302292450 / 7893566493 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.




జ్యోతి రెడ్డి,
అమీన్‌పూర్ కమిషనర్

తేదీ : 30-09-2023
సమయం: శనివారం ఉదయం
10 నుంచి 11 గంటల వరకు
అంశం: పారిశుద్ధ్యం సమస్య-పరిష్కారం
ఫోన్ నంబర్లు:
7337302638

న్యూస్‌రీల్

ప్రశాంతంగా శోభాయాత్ర



నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రమణ కుమార్

పటాన్‌చెరు టౌన్/ సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లాలో గణేశ్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎస్పీ రమణకుమార్ శుక్రవారం తెలిపారు. వివిధ సబ్ డివిజన్లలోని గణేశ్ నిమజ్జన ప్రాంతాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు.

పటాన్‌చెరులో..
పట్టణంలోని సాకి చెరువు వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జన స్థలాన్ని ఎస్పీ రమణ కుమార్ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ లాలూనాయక్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఎస్పీ మొత్తం ఎన్ని మండపాలు ఏర్పాటు చేశారు? ఎన్ని నిమజ్జనాలు జరిగాయన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిమజ్జనం శాంతియుతంగా సామరస్యంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. వారు పూర్తిగా పోలీసులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. యువకులు నిమజ్జనం సమయంలో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా శోభాయాత్ర నిర్వహించాలన్నారు. పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

రూ.500ల మాఫీకి తీర్మానం

వట్‌పల్లి(అందోల్): చేనేత సభ్యులందరికీ రూ.500ల బకాయి మాఫీ చేయడానికి తీర్మానించామని జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ వర్కల అశోక్ తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం భవనంలో 78వ మహాసభకు అధ్యక్షత వహించారు. అందులో పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. సంఘానికి సంబంధించి క్యాష్ క్రెడిట్ మాఫీ గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పావలా వడ్డీకి సంబంధించి సంఘానికి డబ్బులు రావాల్సి ఉన్నాయని, కార్మికులకు పని కల్పించేందుకు అవసరమైన యారా న్(దారం)లను ఇప్పించాలని తీర్మానించామన్నారు. కొత్త మగ్గాలు ఇప్పించాలని సర్కారును కోరనున్నామని చెప్పారు. కార్మికులకు వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయాలని, సంఘం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర అన్ని విధాలుగా సహకరించాలని ఇంకా పలు అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. నాయకులు సీహెచ్ వెంకటేశం, దుర్గారాం, శ్రీనివాస్, అనంతరాజ్, డీఓ లలిత, హేమలత, కార్యాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు

కోహీర్(జహీరాబాద్): ప్రత్యేక వైద్యశిబిరాలు పేదలకు వరమని డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రమైన కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి శంకర్, డీసీఓ సంగారెడ్డి, సూపరింటెండెంట్ సంధ్య, సర్పంచ్ అతియా జావేద్, ఎంపీటీసీ అనిత సంపత్ పాల్గొన్నారు.

నిందితుడికి ఐదేళ్ల జైలు, జరిమానా

సంగారెడ్డి టౌన్ : గంజాయి అక్రమ రవాణా కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానాను విధిస్తూ అదనపు జిల్లా జడ్జి తీర్పునిచ్చారు. ఈ ఘటన సంగారెడ్డి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గోరక్కుంటకు చెందిన మిథున్ సర్కార్ 2019 ఫిబ్రవరి 16న గంజాయి రవాణా చేస్తూ సంగారెడ్డి జాతీయ రహదారిపై ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై అప్పుడు కేసు నమోదైంది. శుక్రవారం కేసు విచారణకు రాగా అతడికి 5 ఏళ్ల శిక్ష, పది వేల రూపాయల జరిమానాను న్యాయమూర్తి విధించారని పోలీసులు తెలిపారు.

చెత్తపై.. చిత్తశుద్ధి

"అందోల్ జోగిపేటను స్వచ్ఛ పట్టణంగా మారుస్తాం. చెత్తపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తాం. ప్రజలు, వ్యాపారులు కూడా తమ వంతుగా సహకరించాలి. అప్పుడే స్వచ్ఛ సంకల్పం నెరవేరుతుంది. పట్టణంలో దోమల వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్‌కు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా దోమతెరలు వినియోగిస్తే మంచిది."
– మున్సిపల్ కమిషనర్, సీహెచ్ తిరుపతి

- అందోల్–జోగిపేట స్వచ్ఛ పట్టణంగా మారుస్తాం
- దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ తిరుపతి

వట్‌పల్లి(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఆయన అన్నారు. శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. పట్టణ వాసులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సమాధానాలిచ్చి సమస్యల పరిష్కరిస్తామని వెల్లడించారు.

అందోల్‌లోని బాలికల పాఠశాల వెనుకాల డబుల్ బెడ్‌రూంల వద్ద డ్రైనేజీ పైపు పగిలి దుర్వాసన వస్తుంది. పైగా దోమలు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాలి.
– తులసి క్రిష్ణ, 7వ వార్డు

కమిషనర్: ఇప్పటివరకు ఈ సమస్య నా దృష్టికి రాలేదు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం.

జోగిపేటలోని 1వ వార్డులో తడి,పొడి చెత్త సేకరణకు వాహనం రావడం లేదు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
– సంతోష్, కాలనీవాసి

కమిషనర్: వాహనాలు మరమ్మతులో ఉన్నందున రావడం సాధ్యపడ లేదు. రోజుమార్చి రోజు తప్పకుండా చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

మా వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలియజేశాం. దోమల బెడద కూడా నెలకొంది.
– రవీందర్‌గౌడ్, 19వ వార్డు

కమిషనర్: కుక్కల తరలింపునకు ఇప్పుడు అవకాశం లేదు. వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించేందుకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం.

మా కాలనీలో రెండు, మూడు రోజులకోసారి చెత్త బండి వస్తుంది. చెత్త వేసేందుకు చెత్త బుట్ట కావాలి.
– సంతోష్‌కుమార్, 8వ వార్డు

కమిషనర్: చెత్త బుట్టల ఏర్పాటు చేసే ప్రక్రియకు స్వస్తి పలికి.. రోజు తడిపొడి చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటున్నాం.



'ఫోన్‌ఇన్'లో కమిషనర్ తిరుపతి

మా వార్డులోని కందకంలో నీరు నిలుస్తోంది. దోమల వ్యాప్తి పెరిగి రాత్రి కంటి నిండా నిద్ర లేకపోకుండా పోతోంది.
– నవీన్, 7వ వార్డు

కమిషనర్: మున్సిపాలిటీ కార్మికులతో దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. వాటి తీవ్రత ఎక్కువగా ఉంటే యాంటీ లాటిన్ మథాలియాను పిచికారీ చేయిస్తా. పారిశుధ్య కార్మికులను పంపుతాం.

మార్కెట్ గంజ్ 2వ గేటు వద్ద డ్రైనేజీ కోసం తవ్విన రాళ్లను కుప్పగా వేశారు. చెత్తను కూడా అక్కడే వేస్తున్నారు. అందులో పందులు సంచరిస్తున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం.
– సత్యం, జోగిపేట

కమిషనర్: కాంట్రాక్టర్‌కు చెప్పి కుప్పగా వేసిన రాళ్లను తొలగింపజేస్తాం. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం.

కుమ్మరి బట్టీల వద్ద సీసీ రోడ్డు వేయకపోవడంతో అటువైపుగా నుంచి నడిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు పక్కనే పిచ్చి మొక్కలు పెరిగి పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి.
– భాస్కర్, 10వ వార్డు

కమిషనర్: సీసీ రోడ్డు వేయాలనుకుంటే కొందరు అడ్డుతగలడంతో వేయలేకపోయాం. వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. ముందుగా పిచ్చి మొక్కలు తొలిగింపునకు చర్యలు తీసుకుంటాం.

మాస్టర్‌ప్లాన్‌లో మున్సిపాలిటీ పరిధిలోకి పక్కనే ఉన్న గ్రామాలను విలీనం చేసే అవకాశం ఉందా?
– శ్రీనివాస్, జోగిపేట

కమిషనర్: ప్రస్తుతం గ్రామాలను విలీనం చేసే ప్రతిపాదనలు లేవు. భవిష్యత్‌లో ప్రభుత్వం అవసరాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటుంది.

వాసవి నగర్‌లో ఐదురోజులకోసారి కూడా చెత్త బండి రావడం లేదు. దీంతో పేరుకుపోయిన చెత్తను కోతులు చిందరవందర చేస్తున్నాయి.
– లక్ష్మీనారాయణ, 20వ వార్డు

కమిషనర్: ఆ కాలనీలోకి వచ్చే చెత్త బండి డ్రైవర్ జ్వరం బారిన పడ్డాడు. దీంతో సేకరణ ఆలస్యమైంది. చర్యలు తీసుకుంటాం.



10వ వార్డులో పాత ఇళ్లు కూలిపోయి రోడ్డుపై మట్టి పడటుండగా నడిచేందుకు ఇబ్బందవుతోంది. తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.
– మధు, కాలనీవాసి

కమిషనర్: కూలిపోయిన ఇంటి యజమానులకు నోటీసులిచ్చి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. అలాంటివి ఏమైనా ఉంటే సమాచార మివ్వాలి.

మేము టాయిలెట్, బాత్రూం లేక ఇబ్బందులు పడుతున్నాం. మాకు మంజూరు చేయించండి.
– అంజయ్య, 10వ వార్డు

కమిషనర్: టాయిలెట్, బాత్రూం కట్టుకునేందుకు మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకోండి. స్వచ్ఛభారత్ కింద కట్టుకున్న వారికి రూ.20వేలు ప్రభుత్వం అందజేస్తోంది.

బెల్లంగౌని వద్ద కందకంలో మురుగు నిలిచి దోమలు వ్యాపిచెందుతున్నాయి. కందకాన్ని పూడ్చి రోడ్డు వేయించాలి.
– మహేశ్, 11వ వార్డు

కమిషనర్: రూ.కోటి రూపాయలతో నిధులు కేటాయించి టెండర్ వేశాం. సంబంధిత కాంట్రాక్టర్ పనులు సకాలంలో చేయలేకపోయాడు. రీటెండర్‌కు పిలిచి పనులు పూర్తి చేయిస్తాం.

మా కాలనీలో రోడ్లు శుభ్రం చేసేందుకు ఎవరూ రావడం లేదు. చెత్త పేరుకుపోతోంది. చెట్ల పొదలు పెరిగాయి. దోమల బెడద అధికమైంది.
– సత్యగౌడ్,1వ వార్డు

కమిషనర్: రోడ్లు శుభ్రం చేయించేందుకు పారిశుధ్య సిబ్బందిని పంపుతాం.

సదరు వ్యక్తులు నూతన వెంచర్ కోసం కెనాల్ కాలువ పూడ్చేశారు. దీనిపై చర్యలు తీసుకోగలరు.
– రమేష్, 11వ వార్డు

కమిషనర్: సంబంధిత ఇరిగేషన్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాం. వారు అందించే నివేదిక ఆధారంగా చర్యలుంటాయి.

కలిసికట్టుగా శ్రమిస్తేనే సత్ఫలితాలు



సన్మానం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- డీపీఓ సురేశ్ మోహన్

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పని చేయాలని డీపీఓ సురేశ్ మోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. వాటిని పూర్తిస్థాయిలో విజయవంతం చేయవలసిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా అనేక కార్యక్రమాలను చేపట్టామని వెల్లడించారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ దామం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు, హరితహారం తదితర కార్యక్రమాలను చేపట్టామని గుర్తుచేశారు. వాటికి సంబంధించిన బిల్లులు కూడా చెల్లించామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఏమైనా పెండింగ్ బిల్లులు ఉంటే వాటిని త్వరలో చెల్లిస్తామని ప్రకటించారు. జెడ్పీ సీఈఓ ఎల్లయ్య మాట్లాడుతూ, హరితహారం కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే విషయమై సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఇబ్బందులను, సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీపీఓను, జెడ్పీ సీఈఓను పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాఘువా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్, ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందలం : ఎమ్మెల్యే క్రాంతికిరణ్



గొంగ్లూర్‌లో మన ఊరు మన బడికి ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

పుల్‌కల్(అందోల్): తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొంగ్లూర్, మిన్‌పూర్, మిన్‌పూర్ తండా, ముదిమానిక్య, పుల్‌కల్ మంతూరు గ్రామాల్లో రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులను జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రతి పంచాయతీకి కేటాయించిన నిధులతో గ్రామాల్లో, మున్సిపాలిటీలో పలురకాల మౌలిక సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. గ్రామాల్లోని సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కమ్యూనిటీ హాల్ పనులను చేపట్టామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వల్లే పలు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్‌నే ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చైతన్య రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, పుల్‌కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారీ, గొంగ్లూర్ సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బర్దిపూర్‌లో కేంద్ర సహాయ మంత్రి పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవత్ కుభ హాజరయ్యారు. ఆయన ఆశ్రమానికి రాగా పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. జ్యోతిర్లింగాల వద్ద స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజాలు కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ నరోత్తం సైతం పూజలు చేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర స్వామి, ఒడిశా రాష్ట్ర సమృద్ధి పార్టీ అధ్యక్షుడు జేసీ మహంతి, ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, నాయకులు, అర్చకులు, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త యజ్ఞం
దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో దత్త యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తగిరి మహరాజ్ 101 జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమంలో నిత్య పూజలు నిర్వహించారు. అందులో భాగంగా జ్యోతిర్లింగాల వద్ద డోలారోహణం, పల్లకీ సేవ కార్యక్రమాలు వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.



కేంద్రం సహాయమంత్రికి జ్ఞాపిక బహూకరిస్తున్న పీఠాధిపతి

గడ్డపోతారం ఈఓ సస్పెన్షన్

- సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు షోకాజ్‌లు
- నిర్మాణాలు లేకుండా ఇంటి నంబర్ల కేటాయింపు వ్యవహారంపై చర్యలు
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం ఈఓ నరేశ్‌బాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతోపాటు సర్పంచ్ ప్రకాశ్‌చారి, ఉపసర్పంచ్ మమత, పంచాయతీ వార్డు సభ్యులకు షోకాజ్ నోటీసులిచ్చారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా ఇంటినంబర్ల కేటాయింపు విషయంలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారులు దర్యాప్తు చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీని ఆధారంగా ఆయన శుక్రవారం ఆదేశాలిచ్చారు. అయితే పంచాయతీ కార్యాలయంలో ఇలాంటి పనులు జరుగుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరించిన సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ వార్డు సభ్యులకు షోకాజు నోటీలను జారీ చేశారు. ఆ మేరకు వివరణ ఇవ్వాలని ప్రజాప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు.



ప్రహరీని కూల్చుతున్న జేసీబీ(ఫైల్)

మేనిఫెస్టోను ఇంటింటికీ వివరించాలి

- దామోదర రాజనర్సింహ

మునిపల్లి(అందోల్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త అంకిత భావంతో పని చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. శుక్రవారం మండలంలోని మేళసంగ్యం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నేతలు సంగారెడ్డిలోని తన నివాసంలో ఆయన సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిని, ఇటీవల ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఉన్న అంశాలను గ్రామాల్లోని ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్, మేళసంగ్యం గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నలుదిక్కులా డబుల్ రోడ్లు



కంగ్టి : గృహలక్ష్మి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- ఇది బీఆర్‌ఎస్ ఘనతే
- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): మండలం కేంద్రం నుంచి నలుదిక్కులా డబుల్ రోడ్లు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి వెల్లడించారు. మండల కేంద్రం కంగ్టిలోని రైతు వేదికలో తడ్కల్, కంగ్టి మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన 237 మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిది ఏళ్లలో చేసిందని అన్నారు. రైతులు, పేదలు, కులవృత్తులు, దళితులు, అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం తమతోనే సాధ్యమన్నారు. ఇటీవల రూ. 18 కోట్లతో కంగ్టి నుంచి కర్ణాటక సరిహద్దు వరకు డబుల్ లైన్ బీటీ రోడ్డు మంజూరైందని స్పష్టం చేశారు. అభివృద్ధిని ఆకాంక్షించే తనను మళ్లీ ఆదరించాలని ప్రజలకు, మహిళలకు కోరారు.

అభివృద్ధే సమస్యలకు పరిష్కారం
నారాయణఖేడ్: గ్రామాలు, గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఖేడ్ మండలం హంగిర్గా(కె)లో శుక్రవారం సీడీఎఫ్ నిధులు రూ.20లక్షలతో సీసీ రోడ్డు, రూ.5లక్షలతో నిర్మించనున్న మట్టి రోడ్డు పనులను భూమిపూజ చేశారు. మౌలిక సదుపాయాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అప్పుడే ప్రజల ఇబ్బందులు దూరమవుతాయన్నారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన నలుగురికి సీఎం సహాయనిధి చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. శనివారం డోవూరులొంక హనుమాన్ ఆలయం వద్ద హోప్ న్యూరో, కార్డియాక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత మెగా వైద్యశిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉన్నారా.. వెళ్లిపోయారా?

- బూత్‌స్థాయి కమిటీల పరిస్థితిపై బీజేపీ ఆరా
- క్షేత్రస్థాయిలోని క్రాస్ చెక్ చేస్తున్న పార్టీ
- రెండు మండలాలకో ఇన్‌చార్జి నియామకం
- వారం రోజులుగా కొనసాగుతున్న ప్రక్రియ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించేది బూత్‌స్థాయి కమిటీలే. క్షేత్రస్థాయిలో పనిచేసే ఇవి ఎంత బలంగా ఉంటే ఆయా పార్టీలకు అంత మేరకు గెలుపు అవకాశాలుంటాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వాటిపై మరోసారి దృష్టి సారించింది. గతంలో నియమించిన ఈ కమిటీలు బలంగా ఉన్నాయా? మొక్కుబడిగా పనిచేస్తున్నాయా? తెలుసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామస్థాయిలో పనిచేసే ఈ కమిటీల అధ్యక్షులు ప్రస్తుతం పార్టీలోనే ఉన్నారా? లేదా ఇతర పార్టీల వైపు వెళ్లిపోయారా? మొత్తం 11 మంది సభ్యుల్లో ఎంత మంది ఉన్నారు. ఎవరు వెళ్లిపోయారు. తెలుసుకునే పనిలో పడింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని పార్టీలు చేరికలపై దృష్టి సారిస్తుంటాయి. తద్వారా తమ పార్టీ బలోపేతానికి, ప్రత్యర్థి పార్టీని బలహీన పరచడానికి అన్ని పార్టీలు చేరికలపై దృష్టి సారిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం వహిస్తున్న గ్రామస్థాయి నాయకులు ఉన్నారా? ఇతర పార్టీల వైపు వెళ్లిపోయారా? అనేది తెలుసుకోవడం కీలకం కావడంతో పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది

రెండేళ్ల క్రితం వేసిన కమిటీలు
పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రెండేళ్ల క్రితం బీజేపీలో బూత్‌స్థాయి కమిటీలను నియమించింది. ఆయా మండలాల్లో పూర్తిస్థాయిలో వాటిని నియమించింది. అప్పుడే గ్రామ, మండల కమిటీలనూ నియమించింది. దగ్గర్లో ఎన్నికలు ఉండటంతో వాటి పరిస్థితిపై ఆరా తీస్తోంది.

రెండు మండలాలకో ఇన్‌చార్జి
ఈ బూత్‌స్థాయి కమిటీల పరిస్థితిని తెలుసుకునేందుకు బీజేపీ ప్రతి రెండు మండలాలకు ఒక ఇన్‌చార్జిని నియమించింది. జిల్లా కమిటీలోని ముఖ్యనేతలకు ఈ బాధ్యతలు అప్పగించింది. వారు ఆయా మండలాలకు వెళ్లి పరిస్థితిని తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ జిల్లాలో వారం రోజులుగా కొనసాగుతోంది. అయితే కమిటీలు పకడ్బందీగానే ఉన్నాయని పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు.



ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలు ఇచ్చిన నివేదిక మేరకు..
ఇతర రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలు గత నెలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు జిల్లాలోని అన్ని మండలాలకు వెళ్లి క్షేత్రస్థాయి నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్‌స్థాయి కమిటీల పనితీరుపై వారు ఆరా తీశారు. అయితే పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని నివేదికలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వాటి పనితీరుపై ఆరా తీస్తోంది. వచ్చే ఎన్నికలకు రెండు నెలలే గడువుండగా వాటిని సరి చేసుకోకుంటే తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయని గ్రహించి ఈ ప్రక్రియను చేపట్టిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

ఛాతిలో నొప్పి.. కుప్పకూలి యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: ఛాతిలో నొప్పి రావడంతో ఓ యువకుడు కుప్పకూలి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఈవీ రమణ తెలిపిన వివరాలు. ఝురాసంగం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన అశోక్(26) బతుకుదెరువు కోసం అమీన్‌పూర్‌కు వచ్చి కూలీ పనులు చేస్తున్నాడు. గురువారం అతనికి ఛాతి నొప్పి వస్తుందంటూ కుప్పకూలాడు. దీంతో వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. శుక్రవారం మృతుడి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..


కనకయ్య మృతదేహం

దుబ్బాక : చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలు. మండల పరిధిలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన చెప్యాల కనకయ్య (55) కూలీ పనులు చేస్తుంటాడు. భార్య కళవ్వ, కొడుకు రాజు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పిల్లలందరికీ వివాహమైంది. గురువారం సాయంత్రం చేపల వేటకని చెల్లాపూర్ సాకి చెరువుకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లతో మృతుదేహాన్ని బయటకు తీయించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేరస్తుడికి రెండేళ్ల జైలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఓ వ్యక్తి మృతికి కారణమైన నేరస్తునికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి డా. రఘురాం తీర్పునిచ్చినట్లు శుక్రవారం సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రామునిపట్లకు చెందిన బొల్లం రాంచంద్రం జూన్ 6, 2019న అదే గ్రామంలో జమీల్ కొడుకుతో గొడవ పడ్డాడు. అక్కడేఉన్న గొల్లపల్లి వెంకటేశం(47) వారిని సముదాయించబోయాడు. ఈ గొడవతో నీకు సంబంధం లేదని వెంకటేశంను రాంచంద్రం దుషిస్తూ నెట్టేశాడు. దీంతో పక్కనే ఉన్న బండరాయిపై పడటంతో వెంకటేశంకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ రెండు రోజులకు మృతి చెందాడు. మృతుని తల్లి గొల్లపల్లి మల్లవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ అశోక్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ తదుపరి పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. ఇరువురి వాదనలు విన్న తరువాత బొల్లం రాంచంద్రంపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

సింగూరు ప్రాజెక్టుకు వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు ఎగువనుంచి భారీగా వరద నీరు వస్తుంది. ఎగువ నుంచి 3,528 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 11వ నంబర్ క్రస్ట్ గేట్ ఎత్తి 8,194 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం జనరేటర్ ద్వారా 1460 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారని ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు.

పరిశుభ్రతకు పెద్దపీట

- అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేయిస్తాం
- సమస్యలను పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిచ్చాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

పరిశుభ్రతకు పెద్దపీట వేశాం. దోమల నివారణకు అన్ని కాలనీల్లో దశలవారీగా ఫాగింగ్ చేయిస్తాం. చెత్తాచెదారాన్ని తొలగించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చిన వెహికల్‌లోనే వేయాలి. స్వచ్ఛ సంకల్పానికి మా వంతు కృషి చేస్తున్నాం. ప్రజలు కూడా ఆ దిశగా సహకారం అందిస్తే. మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవచ్చు. దీంతో రోగాలు కూడా దరిచేరవు. - సంగారెడ్డి, కమిషనర్, బొల్లారం


ఫోన్‌లో సమస్య వింటున్న కమిషనర్ సంగారెడ్డి



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లోని 25 మంది తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై మున్సిపల్ పరిధిలోని ఆయాశాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

దోమల మందును పిచికారీ చేయాలి

-నగేశ్, అంబేడ్కర్ కాలనీ

కమిషనర్ : రెండు రోజులకోసారి అన్ని కాలనీల్లో దశలవారీగా దోమల మందులను పిచికారీ చేయిస్తున్నాం. మీ కాలనీలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

దోమలు ఎక్కువయ్యాయి. వర్షాలకు రోడ్లు బురదగా మారాయి

-మల్లేశ్, పెంటారెడ్డి, రాజు, పోచమ్మబస్తీ

కమిషనర్ :బస్తీలో దోమలను నివారించేందుకు ఫాగింగ్ చేస్తున్నాం. అక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం.

మురుగుకాలువల నిర్మాణాలను చేపట్టాలి

- విజయలక్ష్మి, అంబేడ్కర్ కాలనీ

కమిషనర్ : మీ కాలనీలో మురుగు కాలువల నిర్మా ణాలకు నిధులు కేటాయించాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

మ్యాన్‌హోల్స్ పగిలిపోయాయి. మూసి వేయించేలా చర్యలు తీసుకోవాలి

-రవీందర్‌రెడ్డి, పాత బొల్లారం

కమిషనర్ :పాతబొల్లారంలో పగిలిన మ్యాన్‌హోల్స్ స్థలంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. తక్షణమే ఈ చర్యలు చేపడతాం.

కొత్తబస్టాండ్ నుంచి ఐడీఏ బొల్లారం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. మరమ్మతులు చేయించండి

-నందు, కామేష్, ఐడీఏ బొల్లారం

కమిషనర్ : మున్సిపల్ పరిధిలోని ప్రధాన రోడ్డు పనులు నెల రోజుల్లో పూర్తవుతాయి. అప్పటి వరకు ప్రజలు సహకరించాలి.

మంజీరా నీటి సరఫరా లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం.

-అమర్‌నాథ్ శ్రీరాంనగర్

కమిషనర్ : మంజీరా నీటి సరఫరా కొనసాగుతోంది. నీటి సమస్య లేకుండా సత్వరమే చర్యలు తీసుకుంటాం.

నీటి సమస్యను పరిష్కరించండి

- భాస్కర్, బీరప్ప బస్తీ

కమిషనర్ : మీ కాలనీలో నీటి సమస్యలు లేకుండా ఉండేలా ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేస్తున్నాం. అవసరాన్ని బట్టి మరికొన్ని పంపేలా చర్యలు తీసుకుంటాం.


హాజరైన ఆయా శాఖల అధికారులు

వీధిదీపాలు లేక రాత్రి సమయంలో చోరీలు జరుగుతున్నాయి. లైట్లను ఏర్పాటు చేయించాలి

- ఇర్ఫాన్, ఐడీఏ బొల్లారం

కమిషనర్ : వీధిలైట్ల ఏర్పాటు చేసేందుకు త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి అవుతుంది. పదిహేను రోజుల్లో మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలు, ప్రధాన రహదారుల వెంట వాటిని నూతనంగా ఏర్పాటు చేస్తాం.

వీధి కుక్కలను నియంత్రించండి

-తిరుపతిగౌడ్, వైఎస్సార్ కాలనీ

కమిషనర్ : కుక్కలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. వాటి తరలింపునకు వాహనాలు కూడా సిద్ధం చేశాం.

సీసీ రోడ్లను ఏర్పాటు చేయండి

-రఘు, శ్రీరాంనగర్ కాలనీ

కమిషనర్ : కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాం. ఈ రోడ్డు కూడా మా పరిశీలనలో ఉంది.

వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. రోడ్లను వేయించేలా చర్యలు తీసుకోండి

- కవిత, అంబేడ్కర్ కాలనీ

కమిషనర్ : ఈ కాలనీలో రోడ్లను నిర్మాణానికి ప్రణాళికలు చేపడుతున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారం కానుంది.

అధిక లోడుతో వాహనాలు తిరుగుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

-ఇమ్రాన్, బొల్లారం

కమిషనర్ : ప్రధాన సీసీ రోడ్డు వేస్తుండటం వల్ల భారీ వాహనాలను దారి మళ్లించాల్సి వస్తోంది. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. అధిక లోడ్‌ను నియంత్రిస్తాం. అలాంటి వాహన వివరాలను మాకు ప్రజలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, టౌన్‌ప్లానింగ్ అధికారి నవీన్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, సిబ్బంది ప్రశాంత్, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సమరయోధుల స్మారక స్తూపం

హనుమకొండ పోస్టల్ సూపరింటెండెంట్ వి.హనుమంతు

మద్దూరు(హుస్నాబాద్): ఢిల్లీలో త్వరలోనే సమరయోధుల అమరుల స్మారక స్తూపం నిర్మించనున్నట్లు హనుమకొండ పోస్టల్ సూపరింటెండెంట్ వి. హనుమంతు అన్నారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా తెలంగాణ పోరాటయోధులు, స్వాతంత్ర సమరయోధుల ఇంటి నుంచి మట్టి సేకరణ కార్యక్రమం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. శుక్రవారం మేరీ మిట్టి మేర దేశ్ కార్యక్రమంలో భాగంగా ఖైరన్‌పల్లి, కూటిగల్ గ్రామాలలో తెలంగాణ పోరాటయోధులు నివసించిన ఇళ్ల నుంచి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ.. దేశమంతటా ఇలా సేకరించిన మట్టితో ఢిల్లీలో స్వాతంత్ర్య సమరయోధుల స్తూపం నిర్మించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు రమాదేవి, హరికృష్ణ, అశోక్ కుమార్, భాస్కర్, భిక్షపతి, మల్లారెడ్డి పాల్గొన్నారు.


మట్టిని సేకరిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

ఆభరణాలకు పాలిష్ చేస్తామంటూ..

- మహిళలకు బురిడీ
- ఆరున్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- సీసీ ఫుటేజీలో నమోదు

పెద్దశంకరంపేట(మెదక్): పట్టపగలు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న మహిళలను బంగారు, వెండి, రాగి వస్తువులకు పాలిషింగ్ చేస్తామని నమ్మించి బంగారు నగలతో ఉడాయించిన సంఘటన పెద్దశంకరంపేటలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలాపూర్ కాలనీకి చెందిన బి.రూప నివాసానికి ఓ వ్యక్తి ఇన్‌షర్ట్ వేసుకుని తాను సుభిత అనే కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తానని, తన వద్ద రూ.35కే కిలో పౌడర్‌తో బంగారు, వెండి, రాగి వస్తువులను కడగడం ద్వారా అవి మెరుస్తాయని నమ్మించాడు. ముందుగా రాగి, వెండి పట్టగొలుసులను పౌడర్‌తో కడిగాడు. తర్వాత ఇంట్లో ఉన్న రూపతో పాటు ఆమె అత్త మంగమ్మను కూడా నమ్మించి బంగారాన్ని కూడా పాలిషింగ్ చేస్తానని చెప్పాడు. దీంతో వారివద్ద ఉన్న 3 తులాల పుస్తెల తాడు, మూడున్నర తులాల చంద్రహారం, 3 మాసాల కమ్మలు తీసుకున్నాడు. ఇంట్లో గ్యాస్ స్టౌపై నీళ్ల ఉంచి అందులో కొద్దిగా పసుపు, పౌడర్‌తో పాటు ఆ నగలను వేసినట్టు నటించాడు. 15 నిమిషాల తర్వాత అందులో నుంచి తీయాలని చెప్పి బంగారంతో బయటకు వచ్చాడు. అంతకు ముందు బైక్‌తో మరో వ్యక్తిని ఇంటి వద్ద ఉంచాడు. బయటకు రాగానే ఇద్దరు కలిసి బంగారంతో పారిపోయారు. అనంతరం ఇంట్లో ఉన్న మహిళలు గిన్నె తెరిచి చూడగా అందులో బంగారం కనిపించలేదు. వెంటనే బయటకు వచ్చి వారిని చూడగా కనిపించలేదు. దొంగలు పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో కనిపించాయి. ఈ మేరకు బాధితురాలు రూప తన భర్త అనిల్‌తో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.


సీసీ కెమెరాకు చిక్కిన అనుమానితుల ఫొటో

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్య

సెల్‌ఫోన్ పోయిందని యువకుడు..


సాదిక్(ఫైల్)

దుబ్బాకటౌన్: సెల్‌ఫోన్ పోయిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం దుబ్బాకలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మండలం హాసన్‌మీరాపూర్‌కు చెందిన మహ్మద్ నీయాజ్ పెద్ద కుమారుడు సాదిక్(21) గతంలో టిప్పర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. సాదిక్ తల్లిదండ్రులు ఉపాధి కోసం కర్ణాటకకు వెళ్లారు. తమ్ముడితో కలిసి కొత్తగా వచ్చిన డబుల్ బెడ్రూం ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం సాదిక్ తన ఫోన్ పోయిందని ఇంటికి వచ్చి తమ్ముడితో చెప్పి బాధపడ్డాడు. ఫోన్‌ను వెతకడానికి తమ్ముడు వెళ్లగా సాదిక్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పీర్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్ల లింగం, లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు ఉన్నారు. లింగం మేకల పెంపకంతో ఉపాధి పొందుతుండగా లక్ష్మి కూలీ పనులకు వెళ్తుండేది. పెద్ద కూతురు ఇంటర్, చిన్నకూతురు 9వ తరగతి, కొడుకు 8వ తరగతి చదువుతున్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురైన లక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం మేకలకు పోసే మందును సేవించి అపస్మారకస్థితిలో పడిఉంది. గమనించిన పెద్ద కూతురు చుట్టుపక్కల వారిని పిలిచింది. వెంటనే ఆమెను 108లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఎస్‌ఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాగుడుకు బానిసై...


అంజయ్య(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొయ్యడ అంజయ్య (53) కుటుంబంతో కలిసి కొద్దిరోజులుగా సిద్దిపేటలో ఉంటున్నాడు. మద్యానికి బానిస కావడంతో అంజయ్యకు లివర్ పాడైంది. ఈనెల 27న గడ్డం చేయించుకుని వస్తానని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయి ఉన్నట్లు చూసిన ఓ వ్యక్తి సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.

గొల్ల కురుమలకు పింఛన్ ఇవ్వాలి


మాట్లాడుతున్న మల్లేశం యాదవ్

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో గొల్ల కురుమల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉడుత మల్లేశం హాజరై మాట్లాడారు. అర్హులైన వారికి గొర్రెల కొనుగోలు కోసం వారి ఖాతాల్లో రూ.లక్షా 75వేలు వేయాలన్నారు. అదేవిధంగా 50 ఏళ్లు నిండిన ప్రతి గొర్రెలకాపరికి పింఛన్ ఇవ్వాలని కోరారు. గొర్రెలను మేపడానికి ప్రతి గ్రామంలో 20 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనివ్వాలన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 8న నియోజకవర్గ స్థాయి గొల్లకురుమల సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యాదమల్లు, మల్లయ్య, గోపాల్, రాజు, లోకేష్, వెంకటేశం, మధు, పోచయ్య, శ్రీశైలం, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్.. ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు


సాయికిరణ్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రోడ్డుపై మలుపు తిరుగుతున్న లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా... మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద శుక్రవారం జరిగింది. సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన బండి సాయికిరణ్(22) ఇంటర్ వరకు చదువుకుని సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బండి సంతోష్ ఇంటర్ వరకు చదివి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి బైక్‌పై జాలిగామ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గజ్వేల్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద సూర్యాపేట జిల్లా గుంపుల గ్రామానికి చెందిన డ్రైవర్ నగరికంటి సైదులు లారీని యూటర్న్ చేస్తుండగా సాయికిరణ్, సంతోష్‌లు వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయికిరణ్ మృతి చెందగా, సంతోష్‌కు గాంధీలో చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదస్థలంలో క్షతగాత్రులు

కుక్కల దాడి నుంచి తప్పించుకోబోయి..

బస్సును ఢీకొన్న బాలుడు.. గాయాలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలో నివసిస్తున్న సైకం శ్రీకాంత్‌రెడ్డి కుమారుడు అనిషిత్‌రెడ్డి ఆడుకుంటూ స్థానిక గాంధీ సెంటర్ వద్ద ఉన్న మా మొబైల్ షాప్‌నకు వచ్చాడు. అక్కడ ఉన్న కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. భయంతో పరుగెత్తిన బాలుడు రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తగిలి కిందపడ్డాడు. ఈ ఘటనలో బాలుడి భుజానికి గాయమైంది.


గాయపడిన బాలుడు

సడక్‌బంద్ విజయవంతం


రోడ్డుపై బైఠాయించిన జేఏసీ నాయకులు

- రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఉద్యమం ఉధృతం
- జేఏసీ నాయకుల అరెస్టు

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధన కోసం రెవిన్యూ డివిజన్ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం మద్దిముచ్చాలలో తలపెట్టిన సడక్‌బంద్ విజయవంతం అయ్యింది. ఈసందర్భంగా చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధనకు ఏర్పడిన జేఏసీ పిలుపులో భాగంగా మద్దిముచ్చాలలో అఖిలపక్ష నాయకులు జనగామ-సిద్దిపేట రోడ్డు పై బైఠాయించి సడక్ బంద్ నిర్వహించారు. సుమారు గంట పాటు రాకపోకలు నిలిచాయి. పోలీసుల జోక్యంతో నిరసన కార్యక్రమాన్ని విరమించిన జేఏసీ నాయకులు మాట్లాడుతూ... చేర్యాల రెవిన్యూ డివిజన్ ఆకాంక్షను తెలంగాణ ప్రభుత్వం విస్మరిస్తే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. పోలీసులు జేఏసీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచినా.. ఈ ప్రాంత ప్రజలు భయపడకుండా సడక్‌బంద్‌ను విజయవంతం చేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, బాల కిషన్, తాడూరి మల్లేశం, సురేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్ర మహేందర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జంగిని రవి, పుల్లం భిక్షపతి, వంగ కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు

ముందస్తు అరెస్టులు

జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన సడక్ బంద్‌ను నిర్వహించకుండా చేర్యాల, కొమురవెల్లి మండలాలకు సంబంధించిన జేఏసీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని వ్యక్తిగత పూచికత్తు పై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో ఆముదాల మల్లారెడ్డి, పుర్మ ఆగంరెడ్డి, తడక లింగం, మిట్టపల్లి నారాయణ, పచ్చోజు రాములు చారి, లింగంపల్లి కనుక రాజు, కొయ్యడ శ్రీనివాస్ కుడకాల బాలమోహన్, మేకల కృపాకర్ ఉన్నారు.

కరెంట్ షాక్‌తో ఆరు పాడిగేదెలు మృతి

- ఆగ్రహించిన గ్రామస్తులు
- విద్యుత్ సిబ్బందిపై దాడి


విద్యుదాఘాతంతో మృతిచెందిన మూగజీవాలు

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుత్ వైరు తెగిపడి ఆరు మూగజీవాలు మృత్యువాతపడిన ఘటన రామాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహించిన గ్రామస్తులు లైన్‌మెన్, ఏఈ, ఆపరేటర్‌పై దాడి చేశారు. ఇళ్లపై నుంచి ఉన్న 11 కేవీ తీగలను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చల్ల నర్సింలు వ్యవసాయంతో పాటు పాడిపశువుల పోషణ చేపడుతాడు. రోజు మాదిరిగా గురువారం రాత్రి ఇంటి సమీపంలోని పశువుల పాకలో నాలుగు పాడి గేదెలతో పాటు దూడను ఉంచాడు. కొద్ది దూరంలో మంతూరి నాగులు తన జెర్సీ ఆవును కట్టి ఉంచాడు. గురువారం రాత్రి పది గంటల ప్రాంతంలో 11 కేవీకి చెందిన విద్యుత్ వైరు తెగి పశువులపై పడడంతో అవి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. అదేవిధంగా విద్యుత్ వైరు సింగిల్‌ఫేజ్ కేబుల్‌పై పడడంతో పలు నివాస గృహాల్లోని ఫ్యాన్లు, టీవీలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెటర్నరీ అధికారి ఫజల్ శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. గురువారం రాత్రి ఘటన విషయంపై సమాచారం ఇచ్చినా శుక్రవారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకోలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు అక్కడకు ఆలస్యంగా వచ్చిన విద్యుత్ ఏఈ, లైన్‌మెన్, ఆపరేటర్‌లపై దాడిచేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించి సుమారు మూడున్నర లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు బాధిత కుటుంబసభ్యులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. విద్యుత్ లైన్‌మెన్‌ను వెంటనే విధులనుంచి తొలగించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు. దీంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా తనవంతు కృషి చేస్తానంటూ ఏఈ హామీనివ్వడంతో గ్రామస్తులు శాంతించారు.